There is Joy
Where there is




JOTHI
ENGINEERING WORKS
Industrial Estate
MADURAI-625 007

--ATHMAS


భయపడి ఎవ్వరుకూడా కాళ్ళని కొంచెమైనా కదల్చటం లేదు.

తిట్టుకొంటూ గొంతు చించుకొని రంకెలు వేస్తు ఎలాగైతేనేం బగీరథ ప్రయత్నం చేసి కండక్టరు టికెట్లివ్వటం పూర్తిచేసాడు.

చేతిలోని టికెట్ పంచర్‌తో ఇనుపరాడ్ మీద విసుగుతో కసిదీరా టక్ టక్ మని బాది డ్రైవర్‌కి వర్తమానం పంపించేసాడు.

ఇందాక బయట్నుంచి సీట్లో కర్చీఫ్ పడవేసి పోయిన న్యూసు పేపరు మార్కు చొక్కా ధరించిన హిప్పీయువకుడు అడ్డుగా నిలబడి వున్న జనం మధ్య లోంచి అతి కష్టంగా దారి చేసుకొంటూ తను ఆపుకొన్న సీటు దగ్గిరకొచ్చాడు.

అక్కడ సీటులో తను వేసిన కర్చీఫ్ లేదు— అది కాస్తా తీసి చేతిలో పట్టుకొని దర్జాగా కూర్చొని వున్నాడో ఆసామి.

అతనికి ఏభై సంవత్సరాలు దాటి వుండచ్చు వయసు. కాని ఆ మనిషి పెంచుకొన్న అంతలావు మీసాలు చూస్తే అలా అన్పించదు ఎవ్వారికైనా. రానిపాల్ వాడి ఉతికినట్టుగా వున్న తెల్లని ధోవతీ లాల్చీ ధరించాడు.

ఎడమ చేతికి ఏ ఒక్క వేలునూ వొదిలి పెట్టకుండా ఉంగరాలు పెట్టుకున్నాడు, నోట్లో పాన్ గామోసు కాసాపిగా నలిమివేస్తున్నాడు.

తాను ఆపుకొన్న సీటులోనుంచి కర్చీఫ్ తీసి చేతిలోపట్టుకు మరీ కూర్చొన్న అతన్ని చూసేసరికి ఆ అబ్బాయికి చెప్పలేనంత కోప మొచ్చింది.

తీక్షణంగా ఆ వ్యక్తికేసి చూస్తు—"నా సీటులో కూచున్నావేమయ్యా లే?" అన్నాడు కోపంగా.

"ఏమిటబ్బాయీ! ఇది నీ సీటా? నీ సీటైతే నేనెందుక్కూర్చుంటా నయ్యా" మీసాల చాటున

కనిపించీ కన్పించకుండా నవ్వుతూ తన చేతనున్న కర్చీఫ్ తీసి అందించాడాయన.

"ఈ కర్చీఫ్ నాది. ఆ సీటులో వేశాను ముందా సీటులోంచి లేవవయ్యా స్వామీ!" జేబు రుమాలు అందుకొంటూ ఆ అబ్బాయి తొందర చేసాడు.

"ఇంతకీ ఈ జేబుగుడ్డ నీదేనా అబ్బాయ్?"

"నాది కాకపోతే...నీదా...?"

"నీదైతే నీకిచ్చేస్తానుగా, మరింకేం...?" తేల్చేశాడు ఆ పెద్ద మనిషి.

ఆయనగారు సీటులో కూర్చుని చేస్తున్న న్యూసెన్సు బొత్తిగా నచ్చలేదా అబ్బాయికి నమిలి మింగేసెలా చూస్తున్నాడు.

"ఈ డొంక తిరుగుడు కబుర్లు కట్టిపెట్టు ఆ సీటు నాది, ముందు లేస్తావా...లేదా...?" అని అరిచాడు.

ఎదుటి పెద్దమనిషి ఏ మాత్రం వెనక్కి తగ్గ లేదు సరికదా "ఈ సీటు నీ సొంత మేమిట బ్బాయ్! జేబు గుడ్డలు వేసి రిజర్వ్ చేసుకోడా నికి?" అంటూ దబాయించాడు.

బస్సులో నిలబడిన ప్రయాణీకులు ఉక్కబోసి చచ్చిపోతున్నారు. వారికి ఊపిరి ఆడనట్లుగా వుంది. బస్సు త్వరగా కదిల్తేనైనా కాస్తంత గాలి తగిలి ప్రాణం కుదుట పడ్తుందని భావించు కొన్న వారికి ఈ తగాదా చిరాకును కల్గిస్తోంది వీరికేసి చురచుర చూస్తున్నారు.

"ఇదిగో! మర్యాదగా ఆసీటులోంచి లేస్తావా లేదా?"

"నువ్వు బెదిరిస్తే బెదురుతానేమిటబ్బాయ్! ఎందుకట్లా అరుస్తావు కాని అలా గమ్మున నిల్చుండ లేవూ"

"యూ డర్టీ క్రీచర్! లేస్తావా లేదా?"

"చూడు నాయనా! నువ్విలా ఇంగ్లీషులో కిచ కిచ మనబోక నేను లేవనంటే లేవను అంతే?"

హిప్పీ అబ్బాయికి చిర్రెత్తు కొచ్చింది. ఇంగ్లీ ష్‌లో చెడమడా తిట్టాడు. ఇంగ్లీషులో తన్నేదో తిడుతున్నాడని అర్థం చేసుకొన్నాడా ఆసామి, కాని ఏమని తిడ్తున్నాడో మటుకు అర్థం కాలేదు.

అంచేత తను వూర్కుంటే లాభం లేదనుకొని అక్కడక్కడా కొంచెం మోటు పదాలు జోడించి తనూ తెలుగులో తిట్లు లంకించుకొన్నాడు.

ఇరువురికీ మధ్యన ఘర్షణ పెరిగి తారస్థాయి నందుకొంది బస్సులో. చాలా మంది ఆ పెద్ద మనిషి వైపే మాట్లాడారు. అప్పుడొచ్చాడు కండక్టరు "ఏమిటి తగాదా?" అంటూ.

"తగాదా వుందనుకొంటె వుంది. లేదను కొంటె లేదు సార్! ఆ అబ్బాయేమో కిటికీ

ఎల్లప్పుడూ...



- సిల్వర్ స్టార్ -

బనియన్లనే ఉపయోగించండి.

: తయారించువారు :

Silver Star Hosiery Mills

No. 18-B, Union Mill Road

TIRUPUR - 638601.

గుండా కర్చీఫ్ వేసి సీటు రిజర్వ్ చేసుకొన్నాట్ట. ఈయనగారు అదికాస్తా ఆక్రమించేసారు. సీటు నాదంటే నాదని ఇరువురూ వాదులాడు కొంటున్నారు ఇదేసార్ తగాదా'' తానేదో చమత్కారంగా మాట్లాడుతున్నానవే భ్రమలో వొయ్యారాలు పోస్తు చెప్పాడో కళ్ళజోడతను.

"సీటులో వేసిన కర్చీఫ్ తీసి చేత్తోపట్టుకుని నేను ఆపుకొన్న సీటులో కూర్చుంటాడా? ఇంత జబర్దస్తీ ఏమిటిఅని?''—ఆసామి కేసి మిర్రి మిర్రి చూస్తూ కండక్టర్‌తో అన్నాడు హిప్పీ అబ్బాయి.

ఇందులో జబర్దస్తి మాటేముంది కండక్ట సాబ్! ఆ మాట కొస్తే ఈ అబ్బాయిదే జబర్దస్తీ! మేమంతా తలుపు దగ్గిర కొట్టుకు ఛస్తుంటే ఈయన గారేమో జేబురుమాళ్ళువేసి సీటు రిజర్వ్ చేసుకొంటాడా? ఆమాత్రం తెలివి మాకు లేకనా? మేము డబ్బులిచ్చి టిక్కెట్లు కొనటం లేదా? ఈయనే కొంటున్నాడా? మీరే చెప్పండి'' మీసాలనో మారు మృదువుగా సవరిస్తూ తాఫీగా వివరించాడు సీటులో కూచున్న పెద్దమనిషి.

అంతా విన్న కండక్టరు—''పోనీవయ్యా! ఆయన పెద్ద మనిషి, కూర్చుంటేనేం? కుర్రాడివి కాస్త నిలబడితే అరిగిపోతావా? అన్నాడు హిప్పీ అబ్బాయితో.

అబ్బాయికి కండక్టరు మీద కూడా కోపమొచ్చింది. "సీటవ్వమని మర్యాదతో అడిగితే ఇవ్వనన్నానా? అతని స్టయిల్ అదీ చూస్తుంటే వొళ్ళు మండుకొస్తుంది'' అన్నాడు.

ఆసామి ఏమాత్రం తక్కువ తినలేదు. పైగా బస్సులో వున్న వారంతా తనకే వత్తాసు పల్కుతున్నారాయె అందుకే దర్పంగా "నిన్ను సీటవ్వమని మర్యాదగా అడిగే ఖర్మ నాకేం పట్టిందోయ్?''

కండక్టరు ఎన్నివిధాల సర్ది చెప్పినా చెవిన పెట్టలేదు, ఇరువురూ అట్లాగే పోట్లాడుకొంటున్నారు.

ఇక ఇది పనికాదని ఆ అబ్బాయి కిటికీలోంచి




శాంతి డైమండ్స్

రసాయనిక వజ్రాలను తయారించుటలో

ప్రసిద్ధి చెందియున్నాము.

వివరములకు:—

బి. కె. ఎన్. కన్నన్ & బ్రదర్సు

నెం. 37, పెద్ద సౌరాష్ట్ర వీధి : తిరుచిరాపల్లి - 620008.




మేము అతినూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసమగు, అత్యాకర్షణీయముగా, నేత్రానందకరమైన, జంకాళాలు మరియు బెడ్‌షీట్లను తయారుచేస్తున్నాము. మహాశయులు మాకు చేయూతనిచ్చి అత్యధికముగా ఆర్డరు ఇవ్వవలెనని కోరుచున్నాము. మీ ఆర్డరును వెంటనే గమనించి సప్లై చేయుదుము.

( ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే )

**Sivakumar Industries**

**BHAVANI – 638301**

**P. B. No. 38, Tel.: "JAMAKALAM"**

**Phone No. 265**

తల బయటకు పెట్టి అవతల కొంచెం దూరంలో మాట్లాడుకొంటున్న స్నేహితుల్ని పిలిచాడు. ఆ ఇద్దరు స్నేహితులూ ఇతను పిలవగానే కిటికీ దగ్గర కంటా వొచ్చి సంగతి పూర్తిగా విని అమాంతంగా ఉగ్రులయ్యేరు.

''సీటులోంచి కర్చిఫ్ తీసి కూర్చోవటం కాకుండా యింకా దబాయిస్తున్నాడా? రాస్కేల్! బయటకు లాగి ఎముకలు విరిగెయ్యమంటాడో అడుగు'' అని వాళ్ళు గర్జించినట్లుగా అనటంతో ఆ పెద్దమనషిలో కొంచెం చలనం కల్గింది,

కాలేజి విద్యార్థులకు కోపంవొస్తే వాళ్ళు అన్నంత పని చేయగలరని ఇదివరలో తెల్సినవాడుకనుక, మారు మాట్లాండకుండా సీటులోంచి లేచిపోయాడు.

దర్జాగా సీటులో కూర్చున్నాడా అబ్బాయి, గర్వంగా అందరికేసీ చూసాడు. ఆనక నిర్లక్ష్యమైన నవ్వొకటి వారివేపు విసిరాడు కూడా.

నిలబడున్న ప్రయాణీకు లందరికీ అతన్ని చూస్తుంటే మండి పోయింది. సీటులోంచి దౌర్జన్యంగా లేపబడిన (వారి దృష్టిలో అది దౌర్జన్యం కిందే లెఖ్క) ఆసామిని సానుభూతిలో చూసేరు.

సీటులో కూర్చొని కిటికీ గుండా ఫ్రెండ్సతో నవ్వుతూ బాతకానీ కొనసాగిస్తున్న హిప్పీ అబ్బాయిని కాల్చేసేలా చూస్తూ రోజు రోజుకీ పెచ్చు మీరి పోతున్న విద్యార్థుల ఆగడాల మీద తలా ఓ వ్యాఖ్యానం మొదలెట్టారు.

డ్రైవర్ ఇంజను స్టార్టు చేసాడు.

'ఇంత బరువు ఎలా మోసేది బాబోయ్!' అని రోదిస్తున్న బస్సు డ్రైవరు గదమాయింపుతో ముక్కుతూ మూల్గుతూ ఎలాగైతేనేం బయలుదేరింది.

చల్లటి గాలి రివ్వున వీస్తూ లోపల చొరబడింది. అంత వరకూ ఒకరు పీల్చి వదిలిన గాలినే మరొకరు పీలుస్తు నిలబడిన ప్రయాణీకుల ప్రాణాలకు హాయి అన్పించింది.

(సశేషం)